# కలం మనిషి

మల్లాది వెంకట కృష్ణమూర్తి



సోమేశ్వర్ మా సందులోనే అద్దె కుంటున్నాడు. నాలానే సోమేశ్వర్ కూడా బ్రహ్మచారి. అతనికీ ఇంగ్లీష్ సినిమాలపిచ్చి వుంది నాలాగే. మా పరిచయం అందువల్ల దృఢపడింది.

ప్రతీ ఆదివారం ఫస్ట్ షోకి నేను, సోమేశ్వర్ కలిసి ఏదో ఓ ఇంగ్లీష్ సినిమాకి వెళ్లడం తప్పదు. సోమేశ్వర్‌కి స్నేహితు లెక్కువ. అందుకు కారణం, సోమేశ్వర్ కథకుడు. నవలలు, గేయాల లాంటివి వ్రాయడు. కేవలం చిన్న కథలే వ్రాస్తాడు గాబట్టి కథకు డంటున్నాను. సాధారణంగా అతని స్నేహితులు కథల గురించే మాట్లాడు కుంటూంటారు కాబట్టి, సోమేశ్వర్ కథలంటే నాకు అంతో, ఇంతో ఆసక్తి ఏర్పడింది.

సోమేశ్వర్ కథలు అప్పుడప్పుడు చదువు తుంటాను, అతని గదికి వెళ్లినప్పుడు. తన కథలు అచ్చయిన పుస్తకాలనేకం సోమేశ్వర్ గదిలో టేబిల్ మీద చిందర వందరగా పడుం టాయి ఎప్పుడూ.

కథలు తప్పక చదవాలనే ఆసక్తి నాకు ఎప్పుడూ లేదు. రచయితలతో స్నేహం చేసుకోవాలనే ఇంటస్ట్ కూడా లేదు. నాకు కథలకి అనేక చక్కటి ఆలోచనలు వస్తూం టాయి కాని, వాటిని కాగితం మీద ఎలా దింపాలో పద్ధతి తెలియదు.

ఆలోచిస్తే. అయిదారు రోజులు కష్ట పడితే తెలుస్తుంది. కాని నాకంత ఓపికలేదు. నాలా అలా ఓపికలేని అనేకమంది కూడా తమ ఆలోచనలని కాగితం మీదకి ఎక్కించ లేరు కాని, వ్రాయగలిగితే, మంచి రచనలే చేయగలరని సోమేశ్వర్‌తో అంటే, సోమేశ్వర్ నవ్వుతాడు.

సోమేశ్వర్ గదిలో ఓ బైండ్ చేసిన పుస్తకం వుంది. ఆ పుస్తకంలో సోమేశ్వర్ చేతి వ్రాతతో, అతను వ్రాసిన శతాధిక కథలు వున్నాయి ముందర ఆ పుస్తకంలో వ్రాసుకుని, తర్వాత కథని కాగితాల మీద నీట్‌గా తిరగరాసి పంపుతూంటాడు సోమేశ్వర్.

ఓసారి మేన్యుస్క్రిప్ట్ బైండ్‌ని తిరగే స్తూంటే ఓ ఇంగ్లీషు టైటిల్ నాకళ్ల బడింది. చిన్న కథ అది. దానిపేరు 'ఒన్స్ ఏ థీఫ్' కథ పేరు బావుంది అనుకోవడంవల్ల నేనా కథని కొద్దిగా వుత్సాహంగా చదివాను, సోమేశ్వర్ బాత్ రూంలో బట్టలు పిండు కుంటుంటే. చిన్నకథే అయినా. మంచి కథ అది. క్లుప్తంగా ఆ కథావస్తువు ఇది.

ఓ ఆదర్శవాది ఇంట్లో అర్ధరాత్రి దొంగ ఒకడు ప్రవేశిస్తాడు. డబ్బు దస్కం మూట కట్టుకుని పారిపోబోతుంటే పట్టుబడతాడు. ఆ ఆదర్శవాది ఆ దొంగని పోలీసులకి అప్పగిం చడు. చావ చితక తన్నడు. ఆ దొంగని ఆ పరిస్థితులకి దిగజార్చిన సంగతులడిగి తెలుసు కుంటాడు. ఆ దొంగ అంటే సానుభూతి ఏర్పడుతుంది. ఆ దొంగకి ఓ వంద రూపా యలు ఇస్తాడు. ఆ దొంగచేత తన ఇంటిదగ్గ రే

**—— పై వారమే ——**

*నటి జయసుధకి ఇష్టమైన ఎనిమిది మంది ఎవరు ?*

కూరలవ్యాపారం ప్రారంభం చేయిస్తాడు.

క్రమంగా ఆ దొంగ, తన దొంగ బుద్ధిని మానుకుని, కూరల వ్యాపారంలో స్థిరపడి, సంఘంలో మంచి మనిషిగా బ్రతుకుతాడు. మంచివాడుగా మారిపోతాడు.

నాకా కథ బాగా నచ్చింది. దొంగతనాలు చేసేదొంగలని మంచి మార్గంలోకి మళ్లించే విధానాన్ని తెలియచేసే ఆ కథ నాకు అమితంగా నచ్చింది. సంఘంలో దొంగతనం ఓ ప్రాథమిక సమస్య. దానికి పరిష్కారంగా మలచబడింది కథ. అలాంటి అవినీతిపరుడుని మంచి మార్గంలో పెట్టాలి అనే సందేశం వుందా కథలో ఆ కథ వెనక అందమయిన, ఆరోగ్యకరమయిన ఆలోచన వుంది.

కథ బావుందన్నాను సోమేశ్వర్‌తో పిండిన బట్టలని, గదిలో తీగల మీద ఆరేస్తూ చెప్పాడు సోమేశ్వర్ నాతో.

"నిజమే. ఆ కథ బావుందని చాలా మంది వుత్తరాలు వ్రాసారు ఒక సందేశం ఇచ్చే కథ అది నీకు తెలుసుగా. అమ్మాయిలకి నచ్చే అందమయిన ప్రేమ కథలు వ్రాయలేను నేను. ఇలాంటి, సంఘానికి పనికివచ్చే కథలు వ్రాయటమంటేనే నాకిష్టం నా ప్రతీ కథా, దాదాపుగా ఇలాగే ఏదో ఓ సందేశాన్ని ఇస్తుంది పాఠకులకి. అందుకే నా కథలంటే చాలామందికి ఇష్టం."

"ఈ కథ ఎలా వ్రాసావు ? ఇంత మంచి అయిడియా ఎలా వచ్చింది ?" అడిగాను తెలుసుకోవాలని.

కథల గురించి ఇంత డైరెక్టుగా సోమేశ్వర్‌ని నేను అంతకు ముందెప్పుడూ అడగటం జరగలేదు కాబట్టే కామోసు వివరంగాచెప్పాడు.

"ఇదివరకెల్లా కథ చదివి, బావుంది బావుల్లేదు" అనిమాత్రమే అనేవాడివి నువ్వు. ఇప్పుడు అడుగుతున్నావుకాబట్టి చెప్తున్నాను. ఆ కథ వ్రాయబోయే ముందు, రెండుమూడు నెలలకితం, పల్లెంచ వెళ్ళాను, ఏదో పనిమీద. నేనుంటున్న ఇంట్లో అర్ధరాత్రి దొంగలు పడ్డారు రెండుమూడు రోజుల తర్వాత ఇద్దరిని పట్టుకున్నారు.

దొంగిలించిన సామాను ఎక్కడ దాచిందీ చెప్పించడానికి కొట్టారు. చెప్పినతర్వాతకూడా, దొంగతనం చేసారనే కోపంతో వాళ్లిద్దరినీ బాగా కొట్టారు స్థంభానికి కట్టేసి. ఆ సంఘటన నా మనసులో హత్తుకుపోయింది. ఓసారి దొంగయినవాడు ఎప్పటికీ దొంగగానే బ్రతకాల్సిన అవసరం లేదనిపించింది. ఫలితంగా ఈ కథ వ్రాసాను."

చిన్నగా నవ్వాను.

"ఒక్క అయిదు నిముషాలాగి. 'ఏ మేన్ కాల్డ్ హార్స్' అనే మంచిసినిమా ఆడుతోంది. వెళదాం" అన్నాడు.

నేను మిగతా కథలు తిరగేయసాగాను.

* * *

దాదాపు పది రోజుల తర్వాత, సెకండ్ షిఫ్ట్ అయాక నేను ప్లేంట్ నుంచి తిరిగి వస్తుంటే, సర్కస్ బుకింగ్ ఆఫీస్ ముందు చాలామంది జనం చేరి ఎవరినో కొట్టడం చూసి అటు వెళ్ళాను ఏమిటో చూద్దామని.

దాదాపు పాతికేళ్ల వ్యక్తిని బాదుతున్నారు జనం. అతనికి ముక్కులోంచి, నోట్లోంచి రక్తం కారుతోంది. పర్స్ పిక్‌పాకెట్ చేసాడుట అంతకుముందే. పాపం. దొరికిపోయాడు.

నేను వాళ్లని వారిస్తూ చూసాను పర్స్ పోయి దొరికిన ఆ వ్యక్తి వంక.. కోపంగా చెయ్యి ఎత్తుతున్నాడతను, మరోసారి ఆ దొంగమీదకి నన్నుచూసి. గుర్తించి ఎందుకో చటుక్కున చెయ్యి దింపేసాడు.

సోమేశ్వర్ అతను.

సో... సోమేశ్వర్ కేవలం కలం మనిషే ! ?

## నీ నేను

గడ్డిపోచపై, రాత్రి
పడ్డ మంచుబొట్టును నేను :
నీ తొలిపిలుపు తరుణ కిరణాన
మహేంద్ర ధనస్సునై మిడిసిపడ్డాను!
తీగతల్లి తూగుటుయ్యేల
పట్టి పువ్వును నేను :
నీ మందహాసాన లసించి
ముంగిట మందారమ్మునై
హసించినాను !!

— సమాఖ్య

# సామాన్యుని సణుగుడు

ఏమిటో ప్రేమ అంటారు పవిత్రమంటారు. దీనికోసం ప్రాణాలిస్తామంటారు. మామూలు కథల్లోనూ సినిమా కథల్లోనూ అలాగే రాస్తున్నారు. సినిమా డైలాగులు అలాగే వుంటాయి ... కాని డ్యూయట్ల దగ్గిర కొచ్చేసరికి "అందించు నీ తీపి పెదవి!" అంటూ అబ్బాయి అరుస్తాడు పబ్లిక్ పార్కులో "అనుభవించు నా వయసు పొంగులన్నీ నీవే...తనివితీరా" అంటూ అమ్మాయి ఆర్కెస్ట్రా సాయంగా అరుస్తుంది. ఆ తర్వాత 'రంయ్' న వాళ్లిద్దరూ వచ్చి ఒండొరులను హత్తుకుపోతారు ... ఆ 'విడరాని' బంధాన్ని— హాల్లో ప్రేక్షకుల్లోగల సామాన్య గృహిణులు బొత్తిగా మాగజీన్‌లు అవీ చదవటానికి అలవాటు పడని వారూ, — కేవలం కళ్ళు మూసుకుని తప్ప మరో రకంగా విడదీయలేరు. అలా వీళ్లు కళ్లు మూసుకున్నారని తెలిసి కాబోలు ఈ బంధం ఎవరూ విడదీయలేని 'పవిత్ర'? బంధం అని డైలాగు కూడా ఉంటుంది.

ఇదేం ప్రేమో ... ప్రాచీన కావ్యాలలో మాదిరీ కాదు — ఆధునిక నవలలో మాదిరీ కాదు "ఏకమైపోదామా" అంటూ ఆడా—మగా ఏకమైపోతూ వుంటే అంత పెద్ద తెరమీద ... దాందుంప తెగిరి ఎంత మంచివాడైనాసరే అమాంతం విలన్ లాగ వెళ్లి వాళ్లని ఆపేయాలనుకుంటాడు కాని నరాలు తెగకుండా వూరుకోగలడా?

ఆహా! ఆహా ! మన తెలుగు సినీ పాటల లోని సాహిత్యం వింటే చాలు మళ్లీ రహస్యంగా సెక్స్ గ్రంధాలేవీ పిల్లలు చదవక్కరలేదు అబ్బబ్బ ! యింత ఘాటు ప్రేమా, మొగుడు పెళ్లాల మధ్య పడగ్గదిలోనైనా కాదూ ... పార్కులో పవిత్రంగా ప్రేమించుకుంటున్న ప్రేయసి ప్రియులయిన స్టూడెంట్ల మధ్య ... కాని దీనిమీద స్టూడెంట్లు ప్రొటెస్టు చేయకపోయారా ? మధ్య మీకెందుకయ్యా పిల్లలు వాళ్లూ అంటారా? నిజమేకాని మరి పిల్లల వాళ్లం కనుకనే కదా...మాకు బాధ ... అదీ సంగతి.

[-వీ]